కథ :

# నిర్ణయం

పి. చందు

వరలక్ష్మి సాయంత్రం మార్కెటు నుండి తిర్గి వచ్చింది. రెండు రోజులుగా ఇంట్లో నుండి ఎటు బయటికి కాలు పెట్టలేదు. గత నెల చివరి వారంలో మొదలయిన సమ్మె ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మార్కెటు వీధుల్లో కొత్తగా దిగిన ఐదువేల మంది సి. ఆర్. పి. యఫ్. పోలీసులు కవాతు చేస్తున్నారు. ఎక్కడ చూసినా పోలీసులే కనిపిస్తున్నారు. బజారులో ఎరక్కపోయి ఎవరైన నిలుచొని ఉంటే పోలీసు లాఠీలు వాళ్ళ వొళ్ళు హూనం చేస్తున్నాయి. వరలక్ష్మి భర్త ప్రభాకర్ ఇంటినుండి ఎటు బయటికి కదలటానికి అవకాశం లేకుండా పోయింది. ఇంట్లో సరుకులు నిండుకున్నాయి. చేతిలో డబ్బు కూడా లేకుండాపోయింది. పండుగకు ఇచ్చిన వెయ్యి రూపాయల అడ్వాన్సు అందుకున్న తర్వాత సరుకులు తేవటం కోసం వరలక్ష్మి తానే బజారుకు వెళ్ళింది. ఇంతవరదాక వాళ్ళు వీళ్ళు అంటే విన్నదేకాని ఎంత నిర్బంధం ఉందో బజారుకు వెళ్ళితేకాని అర్థం కాలేదు.

బజార్ల నిండా రిజర్వు పోలీసులను చూసేసరికి ఆమెకు కొంత భయం కల్గింది. ఎర్రటి మొఖాలు, నెత్తిమీద అదోమాదిరి ఖాకీ టోపీలు, పొడవాటి తుపాకులు, మరికొంతమంది దగ్గర పొట్టి మిషన్ గన్స్‌తో ఎక్కడ చూసిన గుంపులు గుంపులుగా కనిపించే పోలీసులతో బజారు వాతావరణమే మారిపోయింది. బజారులో తిరగాలంటే ఎవరికైనా జడుపు పుడుతున్నది. దానికితోడు పొడవాటి లాఠీలతో ఎందుకు కొడుతున్నారో కూడా తెలియకుండా కనిపించిన వారినల్లా కొడుతుండటం వలన, ఎప్పుడు సాయంత్రాలు జనం బిటబిటలాడుతుండే మార్కెటులో అరకొర మనుష్యులు భయం భయంగా తిరుగుతున్నారు.

వరలక్ష్మితో కూరగాయల మార్కెటులో ఆలుగడ్డలు అమ్మే ముసలవ్వ "మేం కూడా దుకాణంల కూచుండేటట్టులేదు తల్లి, వ్యానులు వేసుకొని వచ్చి మాట పలుకు లేకుండా గంపల్లో మేం అమ్మే కూరగాయలను తీసుకపోతున్నరు. ఇదేందని అడిగేట్టులేదు. వాళ్ళు ఇచ్చిందేదో పుచ్చుకోవాలి తప్ప మారు మాట్లాడేటట్టులేదు" అన్నది.

"మన మాట వాళ్ళకు తెల్వదు. వాళ్ళమాట మనకు తెల్వదు. వాళ్ళకు

1244

కొట్టుడు, కాల్చుడు తప్ప మరో విషయం తెలియదట. ఫుల్ అథారిటీతోని వచ్చిందట" వయసు మీదపడ్డ కార్మికురాలొకతె కూరగాయలమ్మే ముసల్దాని మాటలు విని చెప్పుకొచ్చింది.

"ఇక ఎంత హంగామ జరుగుద్దో ఏమో? ఇదివరకు ఎన్ని స్ట్రైకులు జరిగినా ఎన్నడు గిట్ల లేదు. ఈ కొత్త పోలీసులు వచ్చిన తరువాత బజార్ల తిరిగే పసురాలు సుత కనిపిస్తలేవు. మూడు రోజుల క్రింద మార్వాడి షావుకారి ఆవును మాయంచేసి ఎవరో కోసుకొని తిన్నరట.... చూడబోతే పశువులను కాదు, ఏవరికి మందినే పీక్కతినేటట్టున్నారు" అంది కూరగాయల ముసల్ది.

ఇంటికి వచ్చిన తరువాత కూడా వరలక్ష్మికి ముసల్దాని మాటలే గుర్తుకు వచ్చినవి. అమ్మ బజారుకుపోతే తినటానికి ఏదన్నా తెస్తుందని ఆశతో పిల్లలు ఎదురొచ్చారు. కాని వారికి నిరాశే ఎదురయింది. హడావుడిలో పడిపోయి పిల్లల చిరుతిండికోసం ఏదన్నా తీసుకురావటం మరిచేపోయింది.

సరిగ్గా పది సంవత్సరాల క్రిందట వరలక్ష్మికి ప్రభాకర్‌తో వివాహం జరిగింది. కాలరీ ఉద్యోగమంటే నెలతిర్గేసరికి పింఛనుగా వందలకు వందలు వస్తయని, పల్లెటూర్లో పని చేసినట్టు కూలినాలి చేసుడు తప్పుద్ది, కాలుమీద కాలేసుకొని, ఇంత వండుక తినుడు తప్ప మరోపని ఉండదని అందరు అంటుంటే మురిసింది.

కాలరీకి వచ్చిన తరువాత ఆమె అంచనాలన్నీ తలక్రిందులయ్యాయి. పని చేసుకొని బ్రతికే వానికి ఎక్కడికి పోయినా ఒక్కటే తీరు ఉన్నదని ఆమెకు అర్థం కావటానికి ఎన్నో రోజులు పట్టలేదు. ఆమె భర్త ప్రభాకర్ నెమ్మదస్తుడు. ఇతరుల బాధలు చూసి చలించిపోయే గుణమున్నది. ఆ తత్వమే అతన్ని మిగతా కార్మికులు ఆదరించేలా చేసింది. అతని ఆచరణకు ఆమె ఎప్పుడు అడ్డంకిగా మారలేదు. కుటుంబాన్ని చూసుకుంటూ ఎన్ని మంచిపనులు చేసినా ఆమె అడ్డుకోలేదు. పైగా అంతరాంతరాల్లో గర్వించింది కూడా. నిజానికి వాళ్ళ కుటుంబమే ఒక పోరాట కేంద్రంగా మారింది.

"మనం పోరాడేది న్యాయం కోసమైనప్పుడు మనం దేనికీ భయపడవలసిన పనిలేదు" అనేవాడు ప్రభాకర్. కాని పరిస్థితులు రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చేసరికి తన భర్త తనకు, పిల్లలకు దూరమైపోతాడేమోనన్న భయం పీడించ

1245

సాగింది. ఇంటిపట్టున ఉండి తన కార్యకలాపాలను కొనసాగించడానికి ఆమెకు ఏ అభ్యంతరం లేదు. కాని పరిస్థితులు మారిపోయి, ప్రభుత్వం తీవ్ర నిర్బంధం మొదలుపెట్టిన తరువాత అంతో ఇంతో ఎక్స్‌పోజ్ అయిన కార్యకర్తలకు నాయకులు "పరిస్థితులు మునపటి తీరుగలేవు. మనం మారిన పరిస్థితులకు అనుగుణంగా మన పోరాట రూపాలను మార్చుకోవాలి. అలా మార్చుకోలేనప్పుడు మన ఉద్యమానికి మేలు చేయకపోగా హాని చేసినవారము అవుతామని" అన్నప్పుడు వరలక్ష్మి ముఖంలో సందేహ భయాలు ముసురుకున్నవి.

"అక్కా! మారిన పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచనలు, మన ఆచరణ కూడా మారాలి. అందుకు మనం తయారవ్వాలి. శత్రువు దుర్మార్గంగా దాడి చేస్తున్నడు, మనం అలస్యం చేసిన కొద్దీ దాన్ని అవకాశంగా తీసుకొని మనల్ని తుడిచి పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే మనకు ఇటువంటి చేదు అనుభవాలు ఎదురయినవి. మెరికల్లాంటి కార్యకర్తలను నష్టపోయాము. ఇకముందు మనం తెలిసి తెలిసి నష్టపోవడం మూర్ఖత్వమే అవుతుంది" అన్న ప్రేమపూరితమైన చిన్నని గుండ్రటి కళ్ళు దీపపు కాంతిలో మిలమిలలాడుతూ స్ఫురణకొచ్చాయి.

ఇలాంటివే అనేక ఆలోచనలు వరలక్ష్మిని ఒక్కుమ్మడిగా చుట్టుముట్టాయి. చేతి సంచులు నేలమీద పెట్టి గోడకు ఒరిగి కూర్చున్నది. అమ్మ ముఖంలోని ఆలోచనలు పట్టించుకోని పిల్లలు సంచులన్నీ వెతుకుతున్నరు. వరలక్ష్మి తన ఆలోచనల్లో తనున్నది.

ఆ రాత్రి చాల పొద్దు పోయేవరకు తనకు నిదుర రాలేదు. మనసంతా మొద్దుబారిపోయి, ఎవరో గుండెను పట్టి పీకుతున్నట్టుగా ఫీలయింది. తనతోపాటు నులుకమంచంలో నిదురపోతున్న తన ఇద్దరు పిల్లలను ఎవరో ఎత్తుక పోతారేమో నన్నంత బెరుకుగా, ఇద్దరు పిల్లల మీద చేతులు వేసి అదిమి పట్టుకొని నిదుర రాక విలవిలలాడింది. అప్రయత్నంగానే అమె కన్నులు వర్షించసాగినయి.

ఇదంతా ఎందుకోసం? ఏదో ఉన్నంతలోనే సరిపెట్టుకుంటూ, చాలమంది లాగ బాపులు నడిచిననాడు పనిచేసుకుంటూ, నడవనినాడు అందరిలాగే పస్తులు పండుకుంటే సరిపోయేది కదా? మీదికి వచ్చిన తరువాత ఎటు పోవటానికి దాకనిపించక గిలగిల్లాడితే ... తనకు తెలిసినంతవరకు తన భర్త ఏ తప్పు చేయ

1246

లేదు. కొందరు కార్మికుల్లాగా రోజు తాగివచ్చి ఇంట్లో నానా హంగామా చేసింది లేదు. చివరికి బీడి కూడా ముట్టుకోడు. బావి నడిచిన రోజు క్రమం తప్పకుండా బదీలీలు చేస్తడు. అయినా జీతం చాలేదికాదు. ఎప్పుడు అంతంత మాత్రంగానే బ్రతుకు గడిచిపోయేది. ఆయన పనిచేస్తున్న బావిలో గ్యాస్ వచ్చి తొమ్మిది మంది కార్మికులు ఒక్కసారిగా చనిపోయినప్పుడు, ఆ చనిపోయిన కార్మికులను దహనం చేసేదాక వెంట ఉండి, మరునాడు ఇంటికి వచ్చి, చిన్నపిల్లవాడిలా తనమీద పడి వెక్కి వెక్కి ఏడ్చినప్పుడు.... ఆయనకంటే వయసులో పెద్దవారు కూడా ఆయన్ని గౌరవించి మాట్లాడుతూ తమ కష్టసుఖాలు చెప్పుకుంటుంటే విని తన మనసు గర్వంతో ఉప్పొంగి పోలేదా ?

'లక్ష్మి మనమేమి గొంతెమ్మ కోర్కెకలు కోరటంలేదు. మేము మనుష్యులమే, మనుష్యుల్లా బ్రతకడానికి అవకాశం ఇవ్వండి మనుష్యుల్లా పనిచేయడానికి పరిస్థితులు కల్పించండి. మమ్మల్ని మనుష్యుల్లా చూడండి' అని కోరుతున్నాము అని అతను చెప్పుకపోతుంటే, కాంతివంతమైన అతని మొఖంలోకి తన్మయత్వంతో తదేకంగా చూస్తుండిపోయేది కాదా ?

ఎక్కడ ఆపాల్సి ఉండే అతన్ని ? మనిషిగా ఆలోచించకుండా ఆపాల్సి ఉండేదా ? వరలక్ష్మి గాఢంగా గాలి పీల్చి ఈ లోకంలోకి వచ్చింది.

బజారు నుండి తెచ్చిన సరుకులను ఇంటినిండా పరిచి డబ్బాల్లో, గంజుల్లో సర్ద సాగింది.

"మాకు తినటానికి ఏదితేలేదా అమ్మా" అంటు పిల్లలు కలగజేసుకొని వెలితి నిండిన మొఖాలతో ఇద్దరు ఒకేమారు అడిగారు.

ఆమె తలఎత్తి ఏడేండ్లవయసు వాడయిన పెద్ద కొడుకు మొఖంలోకి చూసింది. వాడు స్టూలు మీద కాలుమీద కాలు వేసుకొని అచ్చం అతని తండ్రి లాగా మూతిముడుచుకొని కూచున్నడు. ఐదేండ్ల చిన్నబాబు దిగాలుగా మొఖం పెట్టిండు. అదేస్టూలు మీద ప్రభాకర్ కూచొని ఇంటి పనిలో తాను మునిగిపోయి ఉంటే దేశ రాజకీయాల గురించి వివరించేది గుర్తుకు వచ్చింది. ఆమె తేరుకొని 'మరిచిపోయిన బిడ్డా, కొద్దిగ ఆగినంక పల్లీలు వేంచి పెడుతాను అంటు పిల్లలను ఊరడించింది. పిల్లలిద్దరు చెరి కొన్ని పచ్చిపల్లీలు పిడికిట పట్టుకొని ఆడుకోవటానికి బయటికి

ఉరికింద్రను. చెదిరిన ఆమె ఆలోచనలు దొంతరలు తెరలు తెరలుగా మళ్ళీ మనసులో మూగినవి.

o o o

రెండు రోజుల క్రింద ప్రభాకర్ ఇంట్లో నుండి బయటకి పోయిండు. ఇంత వరకు మళ్ళీ తిర్గి రాలేదు. అగస్టు ఇరువైనాడు జరుగబోయే ఊరేగింపుకు సన్నాహాలు మొదలుపెట్టిన తరువాత ఇంట్లో అతనికి కాలునిలిచింది లేదు. ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో తెలియటంలేదు. వచ్చినప్పుడు వండిన నాల్గు మెతుకులను గబ గబ నమిలేస్తూ "బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించాలి. కార్మికులంతా వివిధ సమస్యలతో సతమత మయిపోతూ ఎండుటాకుల్లా రెపరెప లాడుతున్నరు. ఈ ప్రదర్శన వాళ్ళ ఆందోళన నుంచి పోరాటాన్ని రగల్చాలి. నివురుకప్పిన నిప్పు లాగున్న వారి కోపాన్ని బయటికి రప్పించాలి. వివిధ యూనియన్లకు ఇష్టం లేకున్నా మనం ఏర్పాటు చేసిన ఐక్య సంఘటనలో కలిసి వచ్చేలా చేయడంలో మనం విజయ వంతమైనాము-మేము వారందరితో ఒకే మాట చెప్పాం" నోట్లో అన్నాన్ని గబ గబ మింగేసి, గడ గడా మంచినీళ్ళ తాగిండు. రెప్పవాల్చకుండా వరలక్ష్మి అతని మొఖంలోకి చూస్తుండి పోయింది. అతను అన్నం తినటం ముగించి లేచివచ్చి వాల్చిన మంచంలో విశ్రాంతిగా కూచొని చెప్పటం మొదలుపెట్టిండు.

"కార్మికులకు మంచి బతుకు కావాలి, కనీస వసతులు కావాలి. అవి పోరాడ కుండా సాధించగలమా? మేం కనీసవసతుల కోసమే పిలుపునిచ్చాం. అవి కావాలంటే మాతో కలవండి. పోనీ కార్మికులకు ఉన్న వసతులే చాలంటారా? అయితే మాతోకలవాల్సిన పనిలేదు".

వాళ్ళ దగ్గర సమాధానం లేదు.

"మరైతే కార్మికుల తక్షణ సమస్యల పరిష్కారానికి ఎందుకు కల్సిరారు అని మేం సూటిగా ప్రశ్నించాము. అయిష్టంగానే వాళ్ళ పోరాటానికి కలిసిరాక తప్పలేదు" అంటూ అతను గబగబా చెప్పుకొచ్చిండు.

ఆమె భర్తకేసి తదేకంగా చూస్తుండి పోయింది. రెండు గదులున్న వారి గుడిసె మధ్యన ఉన్న నిట్టాడుకు ఒరిగి నిలుచున్నది. ఏదో ఆవేశం కమ్మినట్టుగా ఉద్వేగభరితంగా అతను చాల విషయాలు చెప్పుకొచ్చిండు. కాని ఆ విషయాల

1248

మీద ఆమెకు మనసు పోలేదు. అతని ఉత్సాహం చూస్తుంటే ఆమెకు భయం కల్గింది.

మరునాడు ప్రదర్శన అనగా, ఆ రోజు రాత్రంతా బ్యానర్లు రాస్తూ గడిపిండు. ఆ రోజే ప్రభాకర్ తండ్రి వీరయ్య ఊరు నుండి వచ్చిండు. ఇరవై అయిదు సంవత్సరాలు బొగ్గు బాయిలో పని చేసినా అతనికి స్వంతవూరు మీద మమకారం చావక రిటైరుమెంటు కాగా వచ్చిన డబ్బులు తీసుకొనిపోయి స్వంత పల్లెలో వ్యవ సాయం మొదలు పెట్టిండు. రెక్కలు ఉడిగిన తరువాత వ్యవసాయం ఏం చేస్తావని ఎవరన్నా వినిపించుకోకుండా కాలరీ వదలి పల్లెటూరికి పోయిండు. అయితే వ్యవసాయం అతనికి పెద్దగా అనుకూలించలేదు. అయినా భూమిని అంటి పెట్టుకొనే ఉన్నాడు.

వీరయ్య భోజనంచేసి నులక మంచంలో వొరిగిపోయి కొడుకు చేస్తున్న పని చూస్తుండి పోయిండు. ఇదేం పని అనిగాని, ఇది తప్పు అనిగాని, ఒప్పు అని గాని అతను ఎప్పుడు పిల్లలను అడ్డంకి పెట్టలేదు. బుద్ధి జ్ఞానం నేర్చిన వారు తమ మంచేదో, చెడ్డ ఏదో నిర్ణయించుకుంటారని అతను భావించాడు. ఇంకా తడి ఆరని ఎర్రటి సిరా రాతలను అంతంత మాత్రంగా వచ్చే చదువుతో కూడబలుక్కొని చదివిండు.

'కార్మికుల పిల్లలకు ఉచిత విద్యాసౌకర్యం కల్పించాలి లేదా చదువుల కోసం ఖర్చు క్రింద నెలకు వంద అలవెన్స్ ఇవ్వాలి'.

'కార్మికుని ప్రతి గుడిసెకు మంచి నీటి సౌకర్యం కల్పించాలి'

'సూపర్ బజార్ల ద్వారా చౌకధరలకు నిత్యావసర వస్తువులను అందించాలి'

'పనిలో రక్షణ కావాలి'

గుండ్రటి అక్షరాలతో ప్రభాకర్ ఒక్కటొకటిగా వ్రాసి గదినిండా పరిచిండు. ఇంకా వ్రాయవలసిన డిమాండ్స్ చాల ఉన్నాయి. వీరయ్య గది నిండా పరిచిన నినాదాలను కూడబలుక్కొని చదివి.

"అవ్ బిడ్డా దొడ్డికి పోతే నీళ్ళు అందించేందుకు ఓ బదిలీ పిల్లర్‌ను పెట్టాలని రాయి" వీరయ్య.

మాప వీరయ్య అన్న మాటలకు వరలక్ష్మి బీరిపోయి చూసింది. మళ్ళీ ఏవో నినాదం వ్రాయటంలో మునిగిపోయిన ప్రభాకర్ తలఎత్తి తండ్రి ముఖంలోకి చూసిండు. బోసి పండ్లు బయట పడంగా వీరయ్య నవ్వుతున్నాడు.

"ఏం ఇదంతా నవ్వులాటగా ఉందా ?" అంటు ప్రభాకర్ ఉక్రోషంగా అడిగిండు.

వీరయ్య మొఖంలో నవ్వు చెదిరిపోలేదు, తెల్లటి గుబురు మీసాలు అదరంగ "మీరు పెట్టే డిమాండ్లు మేనేజుమెంటు తీర్చేనా ?" అంటూ రెట్టించిండు అను మానంగా. వీరయ్య తన సర్వీసంతా గొడ్డులాగా ఎటువంటి కనీస సౌకర్యాలు లేకుండా పని చేసిండు. ఆయనతో పని చేసిన వారిలో కొందరిని బావి మింగేసింది. అంగ వికలురై వీధినపడ్డారు కొందరు. అధిక పని భారంలో అర్ధాంతర చావులకు గురిఅయిండ్లు కొందరు. నెత్తురంతా బొగ్గు బావిలో ఉడిగిపోయి చీకేసిన బొక్కలా తయారయిండు వీరయ్య. అందుకే అతనికి అపనమ్మకం.

శాంతాన్ని ముఖంలోకి తెచ్చుకొని తండ్రికి నచ్చచెపుతున్న ధోరిణిలో ప్రభాకర్ "ఇవేం గొంతెమ్మ కోర్కెలు కావు. మనం ఒక పశురంతో పనిచేయించు కుంటే, అది ఉండేందుకు ఇంత నీడ కల్పిస్తం, యాల్లకు ఇంత తిండి పెడతం, రోగమొస్తే మందులు ఇప్పిస్తం. రెక్కలు ముక్కలు చేసుకునే కార్మికుడికి అంత కంటే ఎం ఎక్కువ ఇస్తాండ్లు. మనిషి బ్రతుకే పశురం కంటే ఎందుకు కనా కష్టం అయిపోయింది" అన్నాడు తండ్రి మొఖంలోకి పరీక్షగా చూస్తు వడిలిపోయిన వీరయ్య మొఖంలో ఏ భావం స్పష్టం కాలేదు. మారుమాట్లాడకుంటా బీడి ముట్టించుకొని గప్ప గప్ప పొగ వదులుతూపోయి మంచంలో వెల్లెకలుగా పండు కొని వాసాలకేసి చూస్తుండిపోయి కొడుకు మాటలు విన్నడు.

ఆ రోజు సాయంత్రం తిర్గి ఊరెల్లి పోయేందుకు వీరయ్య తయారయిండు. పిల్లలిద్దరు తాతయ్య సంకలో దూరిను. వ్రాసిన బ్యానర్లను కట్టగా కట్టిండు ప్రభాకర్. వీరయ్య కొడుకును దగ్గరికి పిలుచుకొని "ఈ పని మేం ఎప్పుడో చేయవలసి ఉండే.... మా అప్పుడే ఈ పని చేస్తే మీకు ఈ కష్టాలుండేవికాదు. కాని మాకు అప్పుడింత బుద్ధి జ్ఞానం ఉండేదికాదు. మంచేదో, చెడు ఏదో తెలిసేదికాదు. మా

బతుక్కు ఇదే రాసిఉందని, మా కర్మ అనుకునేటోల్లం - నొప్పులు లేకుండా ఏ తల్లి కాన్పు కనదు కాని జర పయిలం బిడ్డా" అంటు వీరయ్య వెళ్ళిపోయిండు.

• • • •

అగష్టు ఇరువైన ఇరువై వేలమంది కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శన చేసిన్రు జన్మలో ఇటువంటి ప్రదర్శన చూడలేదని చెప్పుకొచ్చిన్రు చూసినవాళ్ళు. తీవ్ర నిర్బంధంవల్ల అణచి పెట్టుకున్న కోపాగ్ని లావాలా ఒక్కసారిగా ఎగజిమ్మింది. వేలాదిమంది కార్మికులు వీధుల్లోకి వచ్చారు. ఏదో ఉన్మత్త కోపావేశంతో మెడ నరాలు పగిలిపోతాయన్నంత ఆవేశంతో కార్మికులు నినదించారు. దాదాపుగా రెండు మైళ్ళ పొడవున ప్రదర్శన వీధుల్లో ఊరేగుతుంటే పోలీసులు నిలువు గుడ్లేసుకొని చూస్తుండి పోయిన్రు. ఇది ఊహించని పరిణామం పోలీసులకు. ప్రదర్శనలో బల వంతంగా కలిసి వచ్చిన మిగతా నాయకులు కూడా ఉసిళ్ళపుట్ట తీరుగా వచ్చే జన సందోహాన్ని చూసి ఆశ్చర్యపోయారు. చిలవలు పలవలుగా ప్రదర్శన గురించి చూసిన వాళ్ళు చెపుతుంటే వరలక్ష్మి మనసు ఉద్వేగభరితమైంది.

ఆ ప్రదర్శన తరువాత ప్రభుత్వం అంత వరదాక అమలు జరుపుతున్నామని చెప్పుకుంటున్న మూడు సూత్రాల పథకాన్ని కేవలం నిర్బంధమనే ఏక సూత్ర పథ కంగా మార్చివేసింది కేంద్ర హోంమంత్రి రాష్ట్రప్రభుత్వం అడిగిందే తడవుగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలోని తీవ్రవాదాన్ని అణచడం పేరుమీద కేంద్ర రిజర్వు దళాలను, సి. ఐ. యస్. ఎఫ్ దళాలను పంపించారు. ఆ ప్రదర్శన తరువాతే, కార్మికులపై అధిక పని భారాన్ని మోపడానికి వెదురు తట్టల స్థానే కేను తట్టలను పెట్టింది. దాన్ని వ్యతిరేకిస్తు మొదలయిన సమ్మె, కార్మికులు ఎదుర్కొం టున్న వివిధ సమస్యల పరిష్కారానికై సమ్మె పోరాటంగా పరిణమించింది.

సమ్మె గోదావరి దాటి ఆదిలాబాదు జిల్లా బొగ్గు గనులకు వ్యాపించింది. డెబ్బయి వేలమంది కార్మికులు తట్ట చెమ్మాసులు మూలకు పెట్టి సమ్మెలోకి పోయిన్రు.

ఐదు వేలమంది ఎర్రమొఖాల రిజర్వు పోలీసులు ఒక్కుమ్మడిగా పారిశ్రామిక ప్రాంతం మీద పడ్డారు. రాత్రిపగలు తేడా లేకుండా పోలీసు పెట్రోలింగు జీపులు బర్, బర్ లాడుతూ తిరుగుతున్నవి. వీధులు చీకటైతే చాలు నిర్మానుష్యమై పో

1251

న్నాయి. తుఫాను ముందు ప్రశాంతతలా వాతావరణం మారిపోయింది. సమ్మె గురించి వాస్తవాలు వ్రాసిన స్థానిక విలేఖరులను అధికారులు బెదిరిస్తున్నారు. "మీ యిష్టం వచ్చినట్లు పిచ్చిరాతలు వ్రాస్తే పుచ్చెలు ఎగిరి పోతాయ్" అని డియస్పి గిరిధర్ "అంతా ప్రశాంతంగా ఉంది. ఏదో కొద్దిమంది తీవ్రవాదులు తప్ప సమ్మెను బలపరిచేవారే లేరు" అని ప్రకటించాడు. అలా ప్రకటన వెలువడిన రోజు మధ్యాహ్నమే సాయుధులైన రిజర్వు పోలీసులు వందల సంఖ్యలో వీధుల్లో కవాతు జరిపారు. వీధుల్లో జనం భయంతో తలుపులు మూసుకున్నారు. వరలక్ష్మి పిల్లలు బయటికి పోకుండా రెండు చంకల క్రింద ఆపి, కిటికి నుండి పోలీసు కవాతును పరిశీలించింది. వీధులగుండా పోలీసు కవాతు వెళ్ళిన చాలసేపటికి కాని తేరుకోలేదు. ఎవరో వొంట్లోని సత్తువంతా పీల్చేసినట్టుగా నిస్సత్తువ ఆవరించగా గుండెలను చేతులతో అదుముకొన్నది. ప్రదర్శనకన్నా ఒకరోజు ముందు ఇల్లు విడిచిపోయిన ప్రభాకర్ ఇంకా ఇంటికి రాలేదు.

పడమటికి వంగిన సూర్యుడు పోలీసు కవాతు చూసి భయపడే సామాన్యుడిలా పడమటి కొండల్లో దాక్కోవటానికి పరుగులు పెడుతున్నాడు. ఎప్పుడు ఆకాశంలోకి విషాన్ని చిమ్మే ఎరువుల ఫ్యాక్టరీ పొగగొట్టం మూగపోయి నిలబడిపోయింది. ఎన్టిపిసి మూడవ వంతు ఉత్పత్తి ఆగిపోయింది. అడ్డు అదుపు లేకుండా ఆకాశంలోకి చొచ్చుకపోయిన, ఎప్పుడు నిప్పులు కక్కే చారల చారల చిమ్నిమీద అంతవరదాక ఓపిగ్గా కూచున్న పీతిరి గద్ద లేచి దూరంగా సాగిపోయింది.

"లక్ష్మక్కా ఎవరికోసం చూస్తానవు ? బావ కోసమా ?" అంటూ గారపండ్లు బయట పడంగా నవ్వుకుంటు రాంచందర్ వచ్చిండు. కొత్తగా కొనుక్కున్న సెకండ్ హాండ్ చారలచొక్కా అతని వొంటికి సరిపడక వదులుగా ఉంది. అతిగా బీడీలు కాల్చటం వలన నల్లబడి మొద్దుబారిపోయిన పెదవులు.

"నిన్న పొద్దున లేచి పోయిండు. ఇంకా రాలేదు" అంది తేరుకొని వరలక్ష్మి. ఆమె వెనకాలే ఇంట్లోకి నడిచి ముందు గదిలోని స్టూలు మీద కూచున్నాడు రాంచందర్.

"అక్కా అంత వడ్లు పెరుగు కలిపినట్టుగా ఉంది వ్యవహారం" అంటూ రాంచందర్ మాటల్లోకి దిగిండు. రాంచందర్ వాళ్ళ ఇంట్లో మనిషిలా కలిసిపోయి

1252

ఉంటడు. ఆపదలో సంపదలో పిలువకుండానే వచ్చేంత చనువుంది. ప్రభాకర్ రాంచందర్ ఒకే బావిలో పనిచేయడమే కాకుండా ఒకే పైలి. ప్రభాకర్ అంటే విపరీతమైన అభిమానం.

"మేనేజుమెంటు ఈ సారి మొండికేసేటట్టున్నది. కార్మికులు సమ్మెను ఎన్ని రోజులు చేస్తరో చెయ్యనీ, చేసి చేసి వాళ్ళకే యాష్టవస్తది అప్పుడిక అన్నల మాట వినరు అనుకుంటాండు. ఇంకొక దిక్కు పెద్ద ఎత్తున అరెస్టులు చేసి కార్మికులను భయపెట్టాలను చూస్తాండు" అంటు రాంచందర్ చెప్పుకొచ్చిండు. బీడీ ముట్టించు కొన్నడు. పొగ వదులుకుంటూ "సచ్చి చెడి గీబాయిలకు వచ్చి పడ్డం. ఎక్కడికి పోయినా ఏదే మానికలు అన్నట్టుగున్నది. ఊళ్ళపొంటి దొరలు పడనియ్యలేదు. దొరలకు ఎదురు తిరిగితే పోలీసుకొచ్చిండ్లు. ఊళ్ళన్నీ వెగ్గంపాడు చేసిండ్లు. ఇక గిట్లయితే ఏం బ్రతుకుతామని గీబాయిలకు వచ్చినం. ఇక్కడ గిదే పరిస్థితి. పెనం మీది నుండి పొయ్యిల పడ్డ తీరుగున్నది. గీబాయి దొరలు ఊరి దొరలను మించి పోయిండ్లు. ఇక పోలీసోల్లంటవా, వాళ్ళకింక పట్టపగ్గాలుంటలేవు. జన్నకిడిసిన అంబోతుల్లా ఊరుమీద పడి తిరుగుతాండ్లు ... ఇగ ఎక్కడికి పోయెటట్టున్నది" ఇట్లా చాలసేపు మాట్లాడి పోయిండు.

వంట అయిన తరువాత, పిల్లలకు భోజనాలు పెట్టింది. పిల్లలు నిదుర పోయిన్రు. కడుపులో ఆకలి అనిపించ లేదు. ప్రభాకర్ ఇంకా రాకపోయేసరికి మనసులో ఆరాటం ఎక్కువైంది. ఏదో తిన్నాను అనిపించుకోవడం కోసం పళ్ళెంలో నాల్గు మెతుకులు వేసుకొంది. అదికూడా సరిగా తినలేక పోయింది. మంచంలో అడ్డందిడ్డంగా పండుకున్న పిల్లలను సర్ది మంచంలో వొరిగింది. ఏవేవో ఆలోచనలు చుట్టు ముట్టగా చాలసేపటిదాక నిదురపోలేదు. అప్పుడే కొస్త మగతగా నిదుర కమ్ముకొంటుండగా ప్రభాకర్ వచ్చిండు. వేసుకున్న అంగి బాగా మాసిపోయింది. ముఖం కొస్త పీక్కుపోయినా అతని కండ్లు ప్రకాశవంతంగానే ఉన్నాయి.

"ఇప్పుడు గుర్తుకొచ్చిందా ఇల్లు" అంది నిష్ఠూరంగా వరలక్ష్మి.

"ఏం చెయ్యమంటావు ? సమ్మె రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతున్నది. సమ్మెను ఫేయిల్ చేయడానికి మేనేజుమెంటు, పోలీసులు కుమ్మక్కయి నగ్నంగా ముందుకొచ్చిన్రు. ఈ పరిస్థితిలో మనమంతా ఒక్కతాటిమీద గట్టిగా నిలబడేందుకు మన ప్రయత్నం మనం చెయ్యాలి కదా ?" అన్నాడు కండ్లు చికిలించి.

1253

ఆమె మారు మాట్లాడకుండా మౌనం వహించింది.

ప్రభాకర్ వొంటిమీద అంగి తీసి దండెం మీద వేసిండు. లుంగీ చుట్టుకుంటు "బాగా ఆకలిగా ఉంది.... నిన్నటి నుండి సరిగా అన్నంకూడా తినలేదు" అంటూ క్షణమాగి, "తిండిలేక కాదు, తీరుబాటు లేక" అంటు చెప్పుకొచ్చిండు.

ఆమె అన్నం వడ్డించేసరికి అతను కాళ్ల, చేతులు కడుక్కొని వచ్చిండు. అన్నం తింటున్నంతసేపు అతనేమి మాట్లాడలేదు. బాగా అలసిపోయి ఉండటం వలన అతను తిన్న వెంటనే వచ్చి మంచంలో వొరిగిండు. మరుక్షణమే అతన్ని నిదుర కమ్మేసింది. భర్తతో ఎంతో మాట్లాడాలని అనుకున్న లక్ష్మికి నిరాశ ఎదురయింది చాలసేపు నిదుర రాక అటు ఇటు దొర్లి మెల్లగా నిదురలోకి జారుకుంది.

* * *

పున్నమి వెన్నెల ఆకాశంలో ఊరంతా మత్తుగా నిదురలో మునిగిపోయి ఉంది. ఇరువై నాలుగు గంటలు బడబడలాడే ఫర్టిలైజరు ఫ్యాక్టరీ, సెవన్ ఇంక్లయిన్ సి. యస్. పి. కూడా మూతపడిపోయి అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని ఎక్కువ చేశాయి. సన్నటి కీచురాళ్ళ రొదతప్ప ఎక్కడ ఏ అలికిడి లేదు. పదవ ఇంక్లయిన్ పోయే రోడ్డుప్రక్కనే ఉన్న గ్రామం గ్రామమంతా నిదురలో మత్తుగా జోగుతున్నది. సరిగ్గా సమయం రెండు గంటల రాత్రివేళ, ప్రశాంత నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ మొదలయింది రాక్షసకాండ.

ఊరు మీద ఊరు పడ్డట్టుగా గడబిడ. అది కలో నిజమో తెలుసుకొనేసరికి ఫళ్ళన తలుపు విరిగింది. భయంతో వరలక్ష్మి దిగ్గున లేచి కూచున్నది. ఎదురుగా కుదిమట్టంగా బలసిన పోలీసాఫీసర్ లాఠీ తాటించి విసురుగా ప్రభాకర్ తలమీద వేసిండు. అతను సర్కిలో, డిఎస్పియో ఎవరైంది ఆమెకు తెలియలేదు. తలచిట్లి రక్తం చిమ్మింది. అప్పటికే చుట్టుముట్టిన పోలీసులు లాటీలతో తుపాకి మడమలతో అతని శరీరాన్ని నుగ్గు నుగ్గు చేస్తున్నరు. కాకీ మూకల మధ్యన అతను బాధగా గింజుకుంటూ వరలక్ష్మికి కనిపించిండు. ఏదో శక్తి ఆవరించినట్టుగా, వాళ్ళను తోసుకుంటూ పెద్దగా అరుస్తూ పోలీసు దెబ్బలు భర్తకు తాకకుండా అతన్ని వాటేసుకున్నది. నలుగురు పోలీసులు ఆమెను బలవంతంగా గుంజేసి ప్రభాకర్‌ను బయటికి లాక్కపోయిండ్రు. ఏం జరుగుతుందో తెలియని అమాయక భయంతో ఏడుపు లంకించు

1254

కున్నది. ఆమెకు స్పృహతప్పి కొద్దిసేపట్లో తేరుకున్నది. ఇల్లంతా చిందర వందరయి ఉంది. బియ్యం పప్పు ఉప్పు అంతా కలగలసిపోయి ఇంటినిండా ఎగజల్లి ఉంది. ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండటం వలన పోలీసులకు కావల్సిన సమాచారం ఏదీ దొరకలేదు. భయంతో ఖిల్లి ఏడుస్తున్న పిల్లలిద్దరిని గుండెలకు అదుముకొని వరలక్ష్మి ఏడ్చింది.

ఎంతపని అయిపోయింది. ఇటువంటిది ఎప్పుడో ఒకప్పుడు రాకతప్పదని అన్నలు చెప్పినప్పుడు తానే అతనికి గుదిబండ అయిపోయి, ఇద్దరు పిల్లలను కాళ్ళమీద వేసి "ఈ పిల్ల బిడ్డరికీ నాకు ఇంత విషమిచ్చి నీవు నీ దారి చూసుకొమ్మ"ని అడ్డు నిలిచింది. అటు ఇటు తెల్చుకోలేక వారం పది రోజులు పిచ్చిపట్టినట్టుగా తిర్గి తిర్గి చివరికి ఇంటి దారికొచ్చిడు. కాని చివరికి ఏమైంది? చూస్తూ చూస్తూ తన కండ్ల ముందే యమభటుల్లాంటి పోలీసులు తన ప్రాణాన్ని తన ముందే గద్దలా తన్నుక పోయిన్రు. తన్ను తాను తిట్టుకుంటు వరలక్ష్మి ఏడ్చింది.

చుట్టుపక్కల వాళ్ళు వచ్చిన్రు. ఓ ముసలి తల్లి వరలక్ష్మి తలను చేతుల్లోకి తీసుకొని గుండెలకు అదుముకొని ఓదార్చింది. "వాళ్ళ ఇంట్ల పీనుగలెల్లా, వాళ్ళను మైసమ్మ ఎత్తుకపోను. ఊరు ఊరంతా ఆగం ఆగం చేసి అందినకాడికి అందరిని పట్టుకపోయిండ్లు" తాను కూడా ఏడుస్తూ చెప్పుకొచ్చింది.

వరలక్ష్మి మనసులో ఏదో ఆశ తొంగిచూసింది.

"అపునక్కా మా అయన మాపొల్లను తోలిరావటానికి ఊరెల్లబట్టి బతికి పోయింద్రు కాని, ఉంటే ఆయన్ని కూడా పట్టుక పోయేటోళ్ళు" అంది మరో స్త్రీ.

"మన ఒక్క వాడలనే రెండు వందల మందిని దాక పట్టుకపోయిండ్లు"

ఏం జీపులు ఏం పోలీసులు. అవ్వతోడు ఉసిల్ల పుట్టతీర్గ విరుచుకపడ్డరు" ఇలా తలో మాటన్నరు.

తన భర్త ఒక్కడే కాదు, వందలాదిమంది వెంట ఉన్నరన్న ఏదో సంతృప్తి ఆమెను కొంత ఊరట చెందేలా చేసింది.

తెల్లారే వరకు వాడ మీద ప్రతి ఇంట్లో అదే పరిస్థితి నెలకొని ఉంది.

o o o

1255

ఆ సంఘటన జరిగిన పదవనాడు వరలక్ష్మి ఇంటికి రాంచందర్ వచ్చిండు. ఈ పదిరోజులు వారికి ఆ నోట ఆ నోట ఎప్పటి సంగతులు అప్పుడు తెలుస్తునే ఉన్నాయి. పట్టణంలో దాదాపు రెండు వేలమంది కార్మికులను మూకుమ్మడిగా అరెస్టులు చేసినట్టు తెలిసింది. అయితే ఎవరిని ఎక్కడుంచారో తెలియక అరెస్టు అయినవారి సంబంధీకులు ఆగం ఆగం అయి తిరుగుతాన్రు.

అక్టోబరు నాల్గున ఒక వైపు చర్చలుంటే ఈ అక్రమ అరెస్టులు చేయడ మేమిటని అన్ని కార్మిక సంఘ నాయకులు యాజమాన్యాన్ని కలువడానికి పోతే, వారికి ఇంటర్వ్యూ ఇవ్వకుండానే, మేనేజింగ్ డైరక్టర్ ఆస్ట్రేలియా నుండి నేషనల్ థర్మల్ స్టేషన్‌కు బొగ్గు సప్లయి గురించి చర్చించేందుకు వెళ్ళాడు.

రాంచందర్ రావటం చూసి వరలక్ష్మికి ప్రాణం లేచివచ్చింది. ఈ పదీ రోజులకే మనిషి పూరాగ తెల్లబడి పోయిండు. కుడి కంటె బొక్క మీద ఇంకా మానని గాయం నడవటానికి ఆయాసపడుతూ మెల్లగా వచ్చి ఎప్పటిలా స్టూలుమీద కూచున్నడు. ఆమెకు మనసులో భయం పేరుకపోయి 'ఆయనేడి ?' అని అడిగింది.

"బావతోపాటు అందరు క్షేమమే" అతను మొఖంలోకి నవ్వుతెచ్చుకొని నిర్లిప్తంగా ఏం పరువాలేదన్నట్టుగా తల ఎగరేసి "ఒక్కొక్క గదిలో ముప్పయి నలభై మందిని కుక్కిండ్లు. నిలుచునే చోటులేదు. ఇక పండుకునేది ఎక్కడ. పైకెల్లి తాపకు పదిమందిని పిలిచి ఇంటరాగేషన్....అంటే ఏం లేదు. కాళ్ళలో రోకలి బండలు ఎక్కించాడు" అతని మొఖం వివర్ణమైంది "అవ్వతోడు కడుపుల పేగులు తెగిపోతయి అనుకో" అంటు క్షణమాగి చెప్పుకొచ్చిండు. ఇంతకు వానికి ఏం కావాలంటే? మీలో కార్యకర్తలు ఎవరు? వాళ్ళ పేర్లు చెప్పితే వదిలి పెడతాం అని గాండ్రు కప్ప డియస్పిగాడు ఒక్కటే ఊదర. ఒక వైపు బాధతో మేం విల విల లాడుతుంటే వాడు నింపాదిగా సిగరెట్లు కాల్చుకుంటూ అడిగేటోడు—అవ్వతోడు నాకయితే అప్పుడే వాని గొంతుక కోరికేయాలన్నంత కోపం వచ్చిదంటే నమ్మి.

వరలక్ష్మికి అతని మొఖంలో ఆ సంఘటన తాలూకు నీలినీడలు కనిపించాయి.

రాంచందర్ భారంగా నిట్టూర్చి "ఎవ్వరు ఒక్కమాట కూడా చెప్పలేదు.

1256

ఎవ్వని నోటి గుండా ఒక్కమాట బయటపడ్డా అవతలి వానికి మూడుతదిగదా? ముసలి ముతక వారిని ఓ మాదిరిగా కొట్టిండ్లు. కొద్దిగా నదరుగా ఉన్న వాళ్ళను పొల్లు పొల్లు చేసిండ్లు" ఇంకా ఆ భయంకరానుభూతి తాలుకు విషయాలను చెప్పకొస్తునే ఉన్నడు.

కాని వరలక్ష్మికి, ఆమె భర్తను గురించి స్పష్టంగా ఏ విషయం చెప్పకపోయే సరికి అసహనం పెరిగిపోయి తానే గొంతు విప్పి అడగలేకపోయింది.

రాంచందర్ ఆమె ముఖంలోని భావాన్ని పసిగట్టినట్టుగా తలగోక్కుంటు "ఇంతకు అసలు విషయం చెప్పటం మరిచాను. అక్కా బావను కూడా వదిలేసిండ్లు"

వరలక్ష్మి మొఖంలో ఏదో బాధ
రాంచందర్ లేచి నిలుచున్నడు

"మరి ఇంటికి ఎందుకు రాలేదు? ఎప్పుడ స్తనన్నడు?" అని వరలక్ష్మి అడగాలనుకున్నది కాని అడుగలేదు.

రాంచందర్ మొఖంలో తనకు కావల్సిన భావం కోసం వెతికింది. ఏ భావం కనిపించలేదు.

వరలక్ష్మి అప్పటి నుండి ప్రభాకర్ కోసం ఎదురు చూస్తూనే ఉంది. ప్రభాకర్ వార్తల కోసం అందరిని అడుగుతూనే ఉన్నది.

పచ్చగా సాగే ఆమె సంసారంలో చిచ్చురేపింది ఎవరు? ప్రభాకర్ కుటుంబంమీద మమకారంతో, పిల్లలమీద ప్రేమతో ఇంటికి వచ్చి బతుకగలడా? ఇంతకు ప్రభాకర్ చేసిన నేరమేమిటి?

చీకటి గుయ్యారాల్లాంటి బొగ్గు పొక్కల్లో నల్ల బంగారం ఇంధనం తీసి తామే మానవాళికి ఇంధనమై కనీస వసతుల కోసం మనిషిగా బతకడం కోసం పోరాడటమేనా?

వరలక్ష్మి, ప్రభాకర్ లాంటి లక్షలాది కుటుంబాలు కలిసి జీవించే రోజెప్పుడో,

1257